## ధర్మవరంలో ఇళ్లలో సోదాలు నిర్వహించిన పోలీసులు...!

ధర్మవరం,ఏప్రిల్ 3(ప్రభాతవార్త)



ఇందిరమ్మకాలనీలో అనుమానితుల ఇళ్లలోసోదాలు నిర్వహిస్తున్న టూటౌన్ సీఐరెడ్డప్ప, పోలీసులు

పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ, వైఎస్ఆర్ కాలనీ, కేతిరెడ్డికాలనీలతో పాటు ఎల్1,ఎల్2,ఎల్3,ఎల్4 కాలనీలలో అనుమానితులు, రౌడీషీటర్ల ఇళ్లలో టూటౌన్ సీఐ రెడ్డప్ప ఆధ్వర్యంలో పోలీసులు గురువారం ఉదయం తనిఖీలు నిర్వహించారు. ఇళ్లతోపాటు చుట్టు ప్రక్కల సోదాలు నిర్వహిం చారు. అనంతరం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు చట్టానికి లోబడే ఉండాలన్నారు. ఎటువంటి గొడవల జోలికి వెళ్లరాదని, అందరూ ప్రశాంతంగా జీవించాలని సూచించారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. ఎవరైనా అనుమానితులు కాలనీల్లో తిరిగితే తమకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. అంతేకాకుండా సైబర్ నేరగాళ్లపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.

## చలో విజయవాడకు అనుమతి ఇవ్వండి...!

### సీఐటీయూ, పారిశుధ్యకార్మికుల వినతి

ధర్మవరం,ఏప్రిల్ 3(ప్రభాతవార్త)



మున్సిపల్ కమిషనర్కు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ,పారిశుధ్యకార్మికసంఘం నాయకులు

చలో విజయవాడ కార్యక్రమానికి మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ నాయకులతోకలిసి పారిశుధ్యకార్మికులు మున్సిపల్ కమిషనర్ ప్రమోద కుమార్కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ జేవీరమణ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఆప్కాస్ పద్ధతిని రద్దు చేసి కాంట్రాక్టు విధానం అమలు చేయాలనే ఆలోచనలను విరమిం చుకోవాలని.. ఆలా కాని పక్షంలో కార్మికులకు రెగ్యులర్ చేయాలన్నారు. ఇప్పటికే కార్మికులకు కనీస వేతనాలు అమలు కాక అనేక విధాలుగా ఇబ్బందులకు గురవుతున్నారు, కార్మికులకు సంక్షేమపథకాలు అమలు కావడంలేదని చనిపోయిన కార్మిక కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడంతో వారు అనేక ఇబ్బందులకుగురవుతుంటే ఇప్పుడేమో పుండుమీద కారంచల్లినట్టు రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ పద్ధతిని రద్దుచేసి కాంట్రాక్టు విధానాన్ని అమలు చేస్తామని చెప్పడం కార్మికులకు మరింత నష్టం కల్గించే విధంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి దుర్మార్గపు కాంట్రాక్టు విధానాన్ని వెంటనే విరమించుకోవాలన్నారు. వినతిపత్రం అందించినవారిలో సీఐటీయూ మండల కో కన్వీనర్లు అయూబ్ ఖాన్, కార్మికసంఘం అధ్యక్షకార్యదర్శులు బాబు, ముకుంద, లక్ష్మీఓబుళేశు. నాయకులు చెన్నకేశవులు. ప్రసాద్, ఓబుళప్ప పాల్గొన్నారు.

## కోటి రూపాయలతో బిటి రోడ్డు మంజూరు

అగళి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



రోడ్డు నిర్మాణానికి కొలతలు తీసుకుంటున్న ఇంజినీర్

మండల పరిధిలోని రామనపల్లి గ్రామం నుంచి బైలాంజినేయ స్వామి గుడి వరకు బిటి రోడ్డు నిర్మాణానికి కోటి రూపాయలు మంజూరు అయినట్లు ఇంజినీర్ అబిజిత్ తెలిపారు. సదరు రోడ్డు నిర్మాణానికి కొలతలను తీసుకున్నారు. చాలా రోజులుగా గుడికి వెళ్లడానికి రోడ్డు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని ఇంజినీర్ చలపతితోపాటు శ్రీనివాస్ ఆచార్, కృష్ణప్ప, మంజునాథ్ తదితరులు ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, రాష్ట్ర టిడిపి ఉ పాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి దృష్టికి తీసుకుపోగా అందుకు వారు స్పందించి రోడ్డును మంజూరు చేయించారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు నిర్మాణానికి కొలతలు తీసుకుంటున్న సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ రఘు, రంగనాతప్ప, జుంజన్న, గ్రామస్తులు ఉన్నారు.

## డ్రైనేజ్ వ్యవస్థ లేక రోడ్డుపైనే వర్షపు నీరు,మురికి నీరు

అమరాపురం ఏప్రిల్ 3 ప్రభాతవార్త



నీరు మరియు మురికి నీరు నిల్వదృశ్యం

మండల పరిధిలోని గుణేహళ్లి గ్రామంలో శ్రీ బండి వీర నాగమ్మ దేవస్థానము ముందు ఉన్న సీసీ రోడ్డుకు ఏర్పాటుచేసిన డ్రైనేజ్ మరమ్మత్తు చేయకపోవడంతో విరిగిపోయి రోడ్డుపై మురికితో పాటు బుధవారం రాత్రి కురిసిన చిన్నపాటి వర్షానికి ముడుగుల నీరు నిలిచినట్లు గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు . పెద్దగా వర్షం కురిస్తే ప్రజలు రోడ్డుపై నడవలేని పరిస్థితి నెలకొంటుందని ఇదే రోడ్డుపై అంగన్వాడి సెంటర్ కు మరియు పాఠశాలకు విద్యార్థులు వెళ్లాల్సి ఉందనివారు పేర్కొన్నారు. వీరజ్జనపల్లి ఆశ్రమం, తంబాలహట్టి,నాచేపల్లి ,కర్ణాటక ప్రాంతాలకు ఇదే రోడ్డుపై వెళ్లాల్సి ఉందని సంబంధిత అధికారులు ప్రత్యేక చర్య తీసుకుని మరమత్తు పనులు చేసి నీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై మండల పరిషత్ గ్రామపంచాయతీ అధికారులకు తెలియజేసిన మరమత్తు పనులు చేపట్టలేదని మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు స్పందించి న్యాయం చేయాలని విన్నవిస్తున్నట్లు గ్రామ ప్రజలు పేర్కొన్నారు.

## టిడిపి నాయకుడి కుటుంబాన్ని పరామర్శ

అమరాపురం ఏప్రిల్ 3 ప్రభాతవార్త

మండల పరిధిలో పుల్లికుంట గ్రామం నందు తెలుగుదేశం పార్టీ నాయకుడు రాజు తండ్రి సన్ననాగప్ప అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని గురువారం మండల టిడిపి కన్వీనర్ గణేష్, మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి, పార్లమెంట్ తెలుగు ఉపాధ్యక్షుడు మద్దనకుంట రఘు, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు నాగరాజు, పంచాయతీ టిడిపి కన్వీనర్ మండల డీలర్ల సంఘం ఉపాధ్యక్షుడు స్టూడియో హనుమంతు, టీఎన్టియుసి ఉపాధ్యక్షుడు గొల్ల మారనపల్లి రామచంద్రప్ప, మైనారిటీ నాయకుడు దాదాపీర్, మాజీ ఎంపిటిసి లుశివకుమార్, రవి ప్రకాష్, సిద్ధేశ్వర, కృష్ణమూర్తి తదితరులు పాల్గొని మృతుడి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాయకులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు.



నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు దృశ్యం

## ఉరవకొండ ఎంఎల్ఎస్ పాయింట్ను తనిఖీ చేసిన ఆర్డీవో

### -స్టాక్ రిజిస్టర్లు, నిత్యవసరాలు, గోదాముల పరిశీలన

ఉరవకొండ, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



ఉరవకొండ ఎంఎల్ఎస్ పాయింట్లో నిల్వలను తనిఖీ చేస్తున్న అనంతపురం ఆర్డీవో జి.కేశవనాయుడు

పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోగల అద్దె గోదాముల్లో నిర్వహిస్తున్న ఎంఎల్ఎస్ పాయింట్ను గురువారం అనంతపురం ఆర్డీవో జి.కేశవ నాయుడు తనిఖీ చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఉదయం ఎంఎల్ఎస్ పాయింట్ చేరుకొని స్టాక్ రిజిస్టర్లు తనిఖీచేసి, నిలువవున్న నిత్యవసర వస్తువులను పరిశీలించారు. గోదాముల స్థితిగతులపై ఆరా తీసి ఎంఎల్ఎస్ పాయింట్ ఇంచార్జ్, స్టాకిస్టు కె.చంద్రమోహన్రావుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేఖరులతో ఆర్డీవో జి.కేశవనాయుడు మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని ఎంఎల్ఎస్ పాయింట్ల తనిఖీలు జరుగుతున్నాయన్నారు. తనిఖీ నివేదికను జాయింట్ కలెక్టర్కు సమర్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక తహశీలాద్ర్ ఎస్.మహబూబ్బాషా, సీఎస్డీటీ బి.రాము, ఆర్ఐ టి.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## మారెమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి భూమి పూజ..!

### ఎమ్మార్పీఎస్ నాయకులు,

మడకశిర టౌన్ ఏప్రిల్ 3 ప్రభాతవార్త,



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మడకశిర మండల పరిధిలోని ఎగువ అచ్చంపల్లి గ్రామంలో గురువారం మారెమ్మ అమ్మవారి నూతన దేవాలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. మారెమ్మ అమ్మవారి ఆలయానికి స్థలం దాత రియల్ ఎస్టేట్ నాగేంద్ర తన సొంత పొలంలో అమ్మవారి ఆలయానికి కొంత భూమి దానం ఇచ్చినట్టు అమ్మవారి పూజారి తెలిపారు, ఎమ్మార్పీఎస్ మడకశిర తాలూకా ఇన్చార్జి గౌడనహళ్లి అంజి, నేతృతంలో ఎమ్మార్పీఎస్ నాయకులను కలుపుకొని మరి కొంతమంది గ్రామ ప్రజలతో కలిసి మారెమ్మ అమ్మవారి ఆలయాన్ని పూర్తి చేయాలని ఉద్దేశంతో ముందుకు సాగుతున్నానని నియోజకవర్గంలో ఎవరైనా దాతలు ఈ మారెమ్మ అమ్మవారికి ఏ రూపంగా అయినా సహాయం చేయాలని కోరారు, ఆలయ భూమి పూజ పురోహితులు వేదమంత్రాలతో చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు హాజరై మారెమ్మ అమ్మవారి భూమి పూజ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు టి, అంజినప్ప డిహెచ్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎమ్మార్,హనుమంతు ఏపీ ఎమ్మార్పీఎస్, రఘు, జిల్లా అధ్యక్షులు. ఏపీ ఎమ్మార్పీఎస్, తాలూకా ప్రధాన కార్యదర్శి, ఎమ్మార్పీఎస్. రవి, మేళవాయి ఉగ్ర నరసింహప్ప .కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

## ఉరవకొండను కమ్మేసిన కారు మబ్బులు..!

### -ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం, కురవని వర్షం

ఉరవకొండ, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



ఉరవకొండను సాయంత్రం కమ్మేసిన కారుమబ్బుల దృశ్య

ఉరవకొండ ప్రాంతాన్ని గురువారం సాయంత్రం కారుమబ్బులు కమ్మేశాయి. సాయంత్రం 5.30 గంటల మధ్యలో చల్లటి గాలి వీచి ఒక్కసారిగా వాతావరణం చల్లబడగా ఆకాశంలో నల్లటి కారుమబ్బులు కమ్మేయడంతో చీకట్లు ఆవరించాయి. దీంతో వాహనాలకు హెడ్లైట్లు వేసుకొని రాకపోకలు సాగించాల్సి వచ్చింది. భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసినా ఉరవకొండ ప్రాంతంలో మాత్రం వర్షం కురవలేదు.

## నాలుగేళ్ళు ఐన సంతానం లేదని...ఉరి వేసుకుని వివాహితుడు ఆత్మహత్య

### సంతానం కలగలేదని... నేత కార్మికుడు ఆత్మహత్య.

గోరంట్ల ఏప్రిల్ 3 ప్రభాతవార్త



ఆత్మహత్య చేసుకున్న హరి

మండలంలోని నార్సింపల్లి పంచాయతీ పరిధిలోని కాలేకుంటపల్లి గ్రామానికి చెందిన హరి (30) అనే వివాహితుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గోరంట్ల సీఐ బోయ శేఖర్ తెలిపారు. మృతునికి భార్య గాయత్రి ఉన్నారు. సిఐ తెలిపిన వివరాల మేరకు ఇలా ఉన్నాయి. మృతుడు హరికి గత నాలుగు సంవత్సరాల క్రితం హిందూపురం సమీపంలోని ఊటుకూరు గ్రామంలోని గాయత్రితో వివాహమైంది. వివాహం అయిన నాటి నుంచి మృతుడు అత్తగారి ఇంటిలోనే నివాసముంటు పెద్దిరెడ్డి పల్లెలో నేత వృత్తి ద్వారా కుటుంబ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అయితే నాలుగు సంవత్సరాలు గడిచిన పిల్లలు కాకపోవడంతో మనస్థాపానికి లోనై గత నెల 31న స్వగ్రామమైన గోరంట్ల మండలంలోని కాలేకుంటపల్లి గ్రామానికి వచ్చాడని అయితే ఈనెల రెండవ తేదీ అర్ధరాత్రి తన నివాసంలోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు తెలియజేశారు.

## ధర్మవరంలో బార్ అసోషియేషన్ నూతనకమిటి ఎంపిక...!

ధర్మవరం, ఏప్రిల్ 3(ప్రభాతవార్త)



బార్అసోషియేషన్ నూతనకమిటి సభ్యులు

ధర్మవరం బార్ అసోషియేషన్ నూతన కమిటిని సీనియర్, జూనియర్ న్యాయవాదులు గురువారం ఎంపికచేశారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడిగాఎంఎఖరీమ్, ప్రదానకార్యదర్శిగా డీఎల్ఎన్ మూర్తి, ఉ పాధ్యక్షుడిగా నూర్అహమ్మద్, సహాయ కార్యదర్శిగా బాలసుందరీ.. కోశాధికారిగా అబ్దుల్సాబ్, కమిటిసభ్యులుగా కేఎం రేష్మ, శివకుమాఆర్. మోహన్దాసు.. నరసింహమూర్తి, పెద్దన్న, బాబాఫకృద్దీదన్, మణికంఠ, ప్రసాద్, లను ఎంపికచేశారు. అయితే ప్రదానకార్యదర్శిపదవికి న్యాయవాదులు డీఎల్ఎన్ మూర్తి, చంద్రమోళిలు పోటీపడగా ఇందులోడీఎల్ఎనూర్తి 36, చంద్రమోళికి 31 ఓట్లు రాగా డీఎల్ఎన్ మూర్తి5 ఓట్ల తేడా గెలుపొందారు. దీంతో ప్రధానకార్యదర్శిగా డీఎల్ఎన్ మూర్తిని ఎంపికచేశారు.

## వైభవంగా ప్రారంభమైన బూదగవి అభయాంజినేయస్వామి బ్రహ్మోత్సవాలు

### -భక్తిశ్రద్ధలతో కలశస్థాపన, హోమాలు, స్వామివారికి విశేష పూజలు

ఉరవకొండ, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



కలశ ప్రతిష్ట పూజలు నిర్వహించిన దృశ్యం



అభయాంజినేయస్వామి మూలవిరాట్కు పూజలు నిర్వహించిన దృశ్యం

మండల పరిధిలోని బూదగవి గ్రామంలో వెలసిన అభయాంజి నేయస్వామివారి బ్రహ్మోత్సవాలు స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం చైత్ర శుద్ధ షష్టి గురువారం వైభవంగా ప్రారంభమయ్యా యి. ఈనెల 8వ తేదీ వరకు జరుగనున్న ఉత్సవాల్లో భాగంగా అర్చకులు లక్ష్మీకాంతరావుస్వామి బృందం ఆధ్వర్యంలో ఉదయం గంగపూజ, గోపూజ, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, పుణ్యహావాచనం, పంచగవ్య ప్రాసన, దేవానాంది, రక్షాధారణ, ఋత్విక్వరణం, కళశస్థాపన, స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. సాయంత్రం ప్రదోషకాల పూజ, మృత్యుగ్రహణం, అంకురార్పణ, వాస్తుకళస స్థాపన, వాస్తు పర్యగ్ని కరణం, అగ్ని ప్రతిష్ట అనంతరం దీక్షా, రక్షఘ్న, వాస్తు హోమాలు, బలిహరణ, అష్టావదాన సేవ, మంగళహారతి కార్యక్రమాలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

## కర్ణాటకలో ప్రారంభం కానీ హైవే పనులు పరిశీలిస్తున్న రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల

అగళి ఏప్రిల్ 3 ప్రభాతవార్త



రోడ్డు పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు

కోడికొండ నుండి ఆగలి మీదుగా కర్ణాటక తుంకూర్ డిస్ట్రిక్ట్ సిరా తాలూకా వరకు 544 హైవే రోడ్ ప్రారంభమైంది కోడికొండ నుండి అగళి బార్డర్ వరకు హైవే పనులను పూర్తి చేశారు శిరా ప్రాంతంలో పనులు ప్రారంభం కాలేదు సదరు కర్ణాటక ప్రాంతాన్ని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పరిశీలించారు త్వరితగతన రోడ్డు పనులు పూర్తి అయ్యేటట్లు కర్ణాటక అధికారులతో మాట్లాడారు వీరి వెంట జెడ్పిటిసి ఉమేష్ కన్వీనర్లు కుమారస్వామి దాసి రెడ్డి ప్రధాన కార్యదర్శి జయప్ప రాజన్న భరత్ ఈరన్న రమేష్ తదితరులు ఉన్నారు

## ఎన్ఎంఎంఎస్కు ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపిక

పుట్టపర్తి రూరల్ మార్చి 03 ప్రభాత వార్త :

పుట్టపర్తి మండల పరిధిలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలు( నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్)కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమేష్ బాబు తెలిపారు. 8వ తరగతి చదువుతున్న తన్మయి శ్రీ, పూజ లు ఎంపికయ్యారనీ వీరు నిరుపేద కుటుంబాలకు చెందిన వారిని. అయితే చదువులో చక్కగా రాణిస్తూన్నా రని తెలిపారు. తన్మయిది పుట్టపర్తి ,వీరి తండ్రి ప్రసాద్ బాబు దినసరి కూలికి వెళ్లి కుటుంబ పోషణ చేస్తున్నారు. పూజా తండ్రి రాజశేఖర్ పుట్టపర్తిలో ఆటో తోలుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తూ, ఎన్ ఎంఎం ఎస్ కు ఎంపికై వీరికి ప్రతి సంవత్సరం 12 వేల రూపాయలు ప్రభుత్వం బ్యాంక్ ఖాతాలలో జమ చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్ పాఠశాల అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

## ఎంసి పల్లిలో సమగ్ర భూ రీ సర్వే ప్రారంభం

రామగిరి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త

మండలంలోని ఎంసిపల్లి రెవెన్యూ గ్రామంలో సమగ్ర భూ రీ సర్వే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. మొదట సమగ్ర భూ రీ సర్వేపై ర్యాలీ నిర్వహించి, అనంతరం గ్రామ సభ నిర్వహించారు. భూ రీ సర్వే వల్ల రైతులకు ఎంతో ఉపయోగం ఉంటుందని రైతులందరు ఈ సర్వేకి సహకరించాలని రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ నరేష్బాబు తెలిపారు. రీ సర్వే నిర్వహించే సమయంలో రైతులు అవసరమైనప్పుడు మీ పొలాల్లోకి వచ్చి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ పద్మ, విఆర్ఓ కేశవ, సచివాలయ సర్వేయర్ వందన, మాజీ సర్పంచు ముత్యాలప్ప, వడ్డి వెంకటేష్, పరందామ, రాధాకృష్ణ పాల్గొన్నారు.

## అధిక వడ్డీ వ్యాపారుల ఆగడాలను అరికట్టాలి

### -సిపిఐ మండల కార్యదర్శి రాములరాయల్



మాట్లాడుతున్న రాములరాయల్

గుంతకల్లు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త

అధిక వడ్డీ వ్యాపారులు, ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల ఆగడాలను అరికట్టాలని సిపిఐ మండల కార్యదర్శి రాములరాయల్ పేర్కొన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన బాధిత మహిళలతో కలిసి మీడియాతో మాట్లాడుతూ ఇతరుల అవసరాలను ఆసరాగా తీసుకుని కొంతమంది అధిక వడ్డీల వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అలాగే ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల ఆగడాలు మితిమీరిపోయాయన్నారు. ఇఎంఐల పేరుతో వేలా పాల లేకుండా అర్ధరాత్రి కూడా ఇళ్ల దగ్గరికి వసూళ్లకు వస్తూ బాధితులను మానసిక వేదనకు గురి చేస్తున్నారన్నారు. మండలంలోని జి.కొట్టాల గ్రామంలో రాధమ్మ అనే మహిళతో ప్రైవేట్ ఫైనాన్స్ ఏజెంట్లు కుమ్మక్కై 30 దళిత, బిసి కుటుంబాలను మోసం చేశారన్నారు. ఫైనాన్స్ కంపెనీల ఒత్తిళ్లు తట్టుకోలేక కొంత మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి వారిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## పిడుగు పాటుతో మహిళ మృతి

గుంతకల్లు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



మృతి చెందిన ఇంద్రజ (ఫైల్ఫోటో)

మండలంలోని కదిరిపల్లి గ్రామానికి చెందిన బుట్ట ఇంద్రజ (24) అనే మహిళ గురువారం పిడుగుపాటుకు గురై మృతిచెందింది. సొంత పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా ఉన్నపలంగా ఆమె పిడుగుపాటుకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. కుటుంబ సభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులుతెలిపారు. మృతురాలికి భర్త, ఏడాది వయసు గల పాప వున్నారు. జరిగిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## తడి చెత్త పొడి చెత్త ప్రాముఖ్యతపై గోరంట్లలో మూడు రోజుల శిక్షణ తరగతులు

### -5 మండలాల సిబ్బందికి అవగాహన -హాజరైన జిల్లా అధికారి సౌజన్య

గోరంట్ల, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద గల వర్మీ కంపోస్ట్ షెడ్డు ఆవరణలో గురువారం రెండవ రోజు తడి చెత్త పొడి చెత్త వాటి ప్రాముఖ్యతపై ఐదు మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లకు అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు రోజుల శిక్షణ తరగతుల్లో భాగంగా రెండవ రోజు శిక్షణా కార్యక్రమానికి జిల్లా డిపిఆర్సి అధికారి సౌజన్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మూడు రోజుల శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా గోరంట్ల, చిలమత్తూరు, సోమందేపల్లి, పెనుగొండ, రొద్దం మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల్లో ప్రత్యేక అధికారి మాట్లాడుతూ వీధుల నుండి సేకరించిన తడి చెత్త, పొడి చెత్తలను వేరుచేసి వాటి ద్వారా వర్మీకంపోస్టును తయారుచేసి ఆదాయాన్ని పెంపొందించుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల మేజర్ పంచాయతీ ఇఒ సుబ్రహ్మణ్యం, జూనియర్ అసిస్టెంట్ సంజయ్కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## గోరంట్ల కూరగాయల సంత...12 నెలలకు రూ.23.22 లక్షల వేలం

### -స్టాండ్ ఫీజు, ఒక జెఆర్పై రూముకు వేలం వాయిదా

గోరంట్ల, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

గోరంట్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంపాటలో కూరగాయల వారపు సంతకు సంబంధించి రుషభదేవుడు 2025-26కు సంబంధించి 23.22 లక్షలకు వేలం పాడారు. గత ఏడాది 8 నెలలకు సంబంధించి 22.03 లక్షలకు వేలం పాడారు. అలాగే స్టాండ్ ఫీజు, ఒక జెఆర్పై రూముకు వేలం వాయిదా పడింది. ఆరు జెఆర్పై రూములకు సంబంధించిన వేలం పాట పూర్తి చేశారు. అలాగే స్టాండ్ ఫీజుకు సంబంధించి వేలం పాట మళ్ళీ ప్రకటిస్తామని కార్యదర్శి తెలిపారు, ఈ కార్యక్రమంలో సర్పంచు సరోజనాగేనాయక్, వార్డు సభ్యులు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు సెయింట్ మేరీ విద్యార్థులు ఎంపిక

గుత్తి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న అండర్ -19 టెన్నిస్బాల్ క్రికెట్ పోటీలకు గుత్తి ఆర్ ఎస్ లోని సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు ఏపి జనరల్ కార్యదర్శి ఆర్డి ప్రసాద్ జిల్లా తరఫున ప్రాతినిథ్యం వహించే క్రికెట్ జట్టుకు సదరు హైస్కూల్ విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ నెల 5, 6తేదీల్లో గుంటూరు జిల్లా పిడుగురాళ్లలో జరగనున్న పోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఎంపికైన విద్యార్థులను గురువారం కరస్పాండెంట్ రెజీనా, ప్రిన్సిపాల్ ఎజిలారాసి, పిఇటి రంగనాయకులు, అధ్యాపకులు అభినందించారు.

## రైతుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

గుత్తి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



ధర్నా చేస్తున్న దృశ్యం

రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట అఖిలభారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, హంద్రీనీవా కాలువను పదివేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలని, అన్నదాత సుఖీభవ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ ఓబులేసుకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి రామాంజనేయులు, రాజశేఖర్, రాజు, ప్రహ్లాద, లక్ష్మీ, దస్తగిరిమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఛత్రపతి శివాజీ వర్ధంతి వేడుకలు

గుత్తి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



నివాళులు అర్పిస్తున్న దృశ్యం

పట్టణంలోని రాష్ట్ర పెన్షనర్ల కార్యాలయంలో గురువారం ఛత్రపతి శివాజీ 345 వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సాహసాలను వక్తలు కొనియాడారు. హిందూ ధర్మ పరిరక్షకుడిగా ఆయనను అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ, కార్యదర్శి కుల్లాయిబాబు, లక్ష్మీనారాయణరెడ్డి, దేవదాస్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

అగళి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



తనిఖీ చేస్తున్న సర్పంచు

అగళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అగళి సర్పంచు లక్ష్మమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి సౌకర్యాలతోపాటు రోగులకు ఏ విధమైన చికిత్స అందిస్తున్నారని రోగులకు మందులు ఇస్తున్నారా, తదితర విషయాలను డాక్టర్ శివానందను అడిగి తెలుసుకున్నారు.

## నాగిరెడ్డిపల్లి లో కురువ కుల బాంధవుల దేవుళ్లను దర్శించుకున్న తెదేపా నాయకులు

బ్రహ్మసముద్రం ఏప్రిల్ 3 ప్రభాతవార్త



వివిధ దేవుళ్లను దర్శనం చేసుకుంటున్న టిడిపి నాయకులు

మండలంలోని నాగిరెడ్డిపల్లి లో నాగిరెడ్డిపల్లి బీర లింగేశ్వర, కనగాని పల్లి పెద్దయ్య,కందుకూరు ఉజ్జినప్ప, కామసముద్రం కరియన్న, ఉడిమి బాగోడేశ్వర స్వామి వార్ల కుల జాతరలో దేవుళ్లను దర్శించుకున్న టీడీపీ మండల నాయకులు బ్రహ్మసముద్రం మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో మాజీ జెడ్పీటీసీ కురుబ వెంకటేష్ సర్పంచ్ కే సందీప్ కుమార్ ఆహ్వాన మేరకు కురుబ కుల బాందవులా దేవుళ్ళు నాగిరెడ్డిపల్లి బీర లింగేశ్వర, కనగానిపల్లి పెద్దయ్య, కందుకూరు ఉజ్జినప్ప, కామసముద్రం కరియన్న, ఉడిమి బాగోడేశ్వర స్వామి వార్లను మాజీ జెడ్పీటీసీ వెంకటేష్ లు, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ కే సందీప్ కుమార్, టీడీపీ మండల నాయకులు పాలబండ్ల సురేంద్ర, మాజీ సర్పంచ్ దండు సత్యనారాయణ టీడీపీ నాయకులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి ఆశీర్వాదం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. బ్రహ్మసముద్రంమండలం ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బ్రహ్మసముద్రం గొంచి గారి శివారెడ్డి, భైరసముద్రం మాజీ ఎంపీటీసీ లింగన్న, గొంచి గారి నాగరాజు, సంతే కొండాపురం మంజు, భైరసముద్రం ఆయకట్టు చైర్మన్ వెంకటేష్ లు, అజ్జయ్యదొడ్డి మాజీ సర్పంచ్ మల్లికార్జున, యర్రకొండాపురం తిరుమల, కృష్ణమూర్తి, చాకలి శివప్ప, బ్రహ్మసముద్రం హై స్కూల్ కమిటీ చైర్మన్ అల్లబాకష్, ఐటీడీపి మండల అధ్యక్షుడు ఎం లోకేష్, స్కూల్ కమిటీ చైర్మన్ మల్లికార్జున, నాగేంద్ర, రమేష్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## వెనుకబడిన బ్రహ్మసముద్రం ను అభివృద్ధి చేయండి టిడిపి నాయకులు

బ్రహ్మసముద్రం ఏప్రిల్ 3 ప్రభాతవార్త



ధర్మ తేజను శాలువాతో సత్కరిస్తున్న టిడిపి నాయకులు

కళ్యాణదుర్గం పట్టణం ప్రజా వేదిక కార్యాలయం లో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు అల్లుడు టిడిపి యువ నాయకులు దేవినేని ధర్మతేజను మాజీ జెడ్పీటీసీ వెంకటేష్ లు, సర్పంచ్ కే సందీప్ కుమార్, టీడీపీ మండల నాయకులు పాలబండ్ల సురేంద్ర, మాజీ సర్పంచ్ దండు సత్యనారాయణ, సంతే కొండాపురం మంజు, కృష్ణమూర్తి, నంజాపురం గొంచి గారి శివారెడ్డి, రాము మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. మండల నాయకులు కళ్యాణదుర్గం లోని అన్ని మండలాల కంటే వెనుకబడిన మండలం బ్రహ్మసముద్రం ను అభివృద్ధి చేసి బ్రహ్మసముద్రం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయనను కోరారు అనంతరం ధర్మ తేజకు పులహారం వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

## వివిధ శుభకార్యాల్లో పాల్గొన్న రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు



వధువరులను ఆశీర్వదిస్తున్న రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు

అగళి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త

మండల పరిధి లోని రామనపల్లి గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి నాయకుడు ఇంజి నీర్ ఎస్వి చలపతి కుమారుని వివా హం కర్ణాటక రాష్ట్రం శిర అన్న పూర్ణేశ్వరి కళ్యాణ మంటపంలో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకలకు రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు, మడకశిర తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ గుండుమల తిప్పేస్వామి హాజరై వధువరులను ఆశీర్వదించారు. అదే విధంగా తుమకూరులో ఒక శుభ కార్యక్రమానికి హాజరై వధువరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వీరివెంట ఎప్వి చలపతి, జడ్పిటిసి ఉమేష్, మడకశిర మార్కెట్యార్డు చైర్మన్ గురుమూర్తి, కన్వీనర్లు కుమారస్వామి, దాసిరెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్, తెలుగుదేశం పార్టీ నాయకులు రాజన్న, జయరామ్, రమేష్, క్లస్టర్ ఇన్చార్జ్ శివకుమార్, సర్పంచు నరసింహమూర్తి, మాజీ ఎంపిపి నరసింహయ్య, రామకృష్ణ తదితరులు హాజరయ్యారు.

## రామగిరిలో ఓ మోస్తారు వర్షం

రామగిరి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :

రామగిరి పలు గ్రామాలోల గురువారం సాయంత్రం ఓ మోస్తారు వర్షం కురిసింది. గరిమేకలపల్లి, ఎంపిపల్లి, మంగాపురం, పేరూరు తదితర గ్రామాలలో ఓ మోస్తారు వర్షం కురవగా రామగిరి, కొత్తపల్లి, చెర్లోపల్లి గ్రామాల్లో చిరుజల్లు పడ్డాయి. వర్షంతోపాటు ఈదురు గాలులు వీయడంతో మొక్క జొన్న, వరిసాగు చేసిన రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వరిపంట వర్షానికి నేలమట్టం పడిపోయే ప్రమాదం ఉందని, అదే విధంగా మొక్క జొన్న కూడా గాలివానకు కంకిదెబ్బతినే ప్రమాదముందని రైతులు అంటున్నారు. అక్కడక్కడ వేరుశెనగ పంట తొలగించిన రైతులు ఇబ్బందులు పడ్డారు.

## ఎర్ర బ్యాడ్జీలతో విధులకు హాజరైన ఎన్ఎంయూఏ కార్మికులు

-1/2019 సర్క్యూలర్ అమలు చేయాలని డిమాండ్

ఉరవకొండ, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



రెండవ రోజు ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన ఎన్ఎంయూఏ కార్మికులు

ఎన్ఎంయూఏ కార్మికులు గురువారం తెల్లవారుజామున మొదటి డ్యూటీ నుండే ఎర్ర బ్యాడ్జీలు ధరించి రెండవ రోజు విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు ఎం.నారాయణస్వామి, జి.వలి మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండవ రోజు నిరసన కొనసాగిందన్నారు. 1/2019 సర్క్యూలర్ అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లు, తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన పదోన్నతులు వెంటనే అమలు చేయాలని, గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలు వెంటనే పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

## గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరిత్యా నేరం

-అవగాహన కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ యు.వెంకటరమణ

ఉరవకొండ, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ యు.వెంకటరమణ

ఆడ, మగ ఇద్దరూ సమానమేనని గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు పీసీ పీఎన్డీటీ చట్టరిత్యా నేరమని హెల్త్ ఎడ్యుకేటర్ యు.వెంకటరమణ అన్నారు. మండల పరిధిలోని నింబగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం పి.కౌకుంట్ల పీహెచ్సీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యు.వెంకటరమణ మాట్లాడుతూ నేటి సమాజంలో మూఢ నమ్మకాలు, ఇతర కారణాలతో అడపిల్లలకు అనేక మంది చిన్న వయసులోనే పెళ్లిళ్ల చేస్తున్నారని బాల్య వివాహాలు చట్టరిత్యా నేరమన్నారు. ఆడ పిల్లలకు చిన్న వయసులో పెళ్లి చేయడంవల్ల వారు గర్భందాల్చి వివిధ రకాల శారీరక, మానసిక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2015 జనవరి 22న బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ఆడబిడ్డలను బతకనిచ్చి చదివించాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలలో ఆరోగ్య సహాయకులు ఎం.ప్రసాద్రావు, ఏఎన్ఎం నాగమ్మ, ఎంఎల్హెచ్పీ మౌనిక, ఆశ కార్యకర్తలు ఉమాదేవి, శాంతి, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చట్టరిత్యా నేరం

-అవగాహన కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.ఎండీ.షఫీ

ఉరవకొండ, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.ఎస్డీ.షఫీ

బాల్య వివాహాలు చట్టరిత్యా నేరమని అమ్మాయికు 18 సంవత్సరాలు, అబ్బాయికు 21 సంవత్సరాలు వయసు నిండిన తరువాతే పెళ్లిళ్ల చేయాలని హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.ఎండీ.షఫీ పేర్కొన్నారు. మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలోగల ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో గురువారం రాకెట్ల పీహెచ్సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్య వివాహాల నిర్మూలణ, టీనేజ్ ప్రెగ్నెన్సీ నివారణ, పీసీ పీఎన్డీటీ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ డి.ప్రశస్తకుమారి అధ్యక్షత వహించగా హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.ఎండీ.షఫీ మాట్లాడుతూ బాల్య వివాహాలవల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, టీనేజ్ ప్రెగ్నెన్సీ కారణంగా పుట్టబోయే పిల్లలపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. పిల్లలు బలహీనంగా పుట్టడం, చనిపోవడం లాంటివి జరుగుతాయన్నారు. బాల్య వివాహాల నివారణకు చదువు ఒక్కటే మార్గమని తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేయడానికి ఎవరైనా ప్రయత్నిస్తే 1098కు ఫోన్ చేసి తెలియజేసి సాయం పొందవచ్చన్నారు. గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరిత్యా నేరమని ఆడ, మగ ఇద్దరూ సమానమేనని వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాఘవేంద్రస్వామి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 8న బూదగవిలో రాతి దూలాన్ని దేశపు ఎద్దులు లాగుడు పోటీలు

- మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ఎడ్ల యజమానులకు నగదు బహుమతులు

ఉరవకొండ, ఏప్రిల్ 3 ప్రభాతవార్త

మండల పరిధిలోని బూదగవి గ్రామంలో వెలసిన అభయాంజినేయస్వామి ఆశీస్సులతో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఈనెల 8వ తేదీన రాతి దూలాన్ని దేశపు ఎద్దులు లాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు గ్రామ ప్రజలు గురువారం తెలిపారు. 7.5 అడుగులు పొడవు, 15 ఇంచులు వెడల్పు, 12 ఇంచులు ఎత్తు గల రాతి దూలన్ని లాగాల్సి ఉంటుందని, ఒక్కో కాడి ఎద్దులకు 6 మంది మాత్రమే సహాయకులు ఉండాలన్నారు. పందెంలో పాల్గొన్న ప్రతి కాడికి రాతి దూలం లాగడానికి 15 నిమిషాల సమయం ఇవ్వడం జరుగుతుందన్నారు. 3 కొరడాలు మాత్రమే ఉండాలని, గొలుసు తెగినా, కాడిమాను విరిగినా అదనపు సమయం ఉండదని తుది నిర్ణయం కమిటీ సభ్యులదేనన్నారు. పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి 20,000 రూపాయలు, రెండవ బహుమతి 10,000 రూపాయలు, మూడవ బహుమతి 5,000 రూపాయలు నగదును అందించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల ఎడ్ల యజమానులు 1,000 రూపాయలు ఎంట్రీ ఫీజు చెల్లించి కమిటీ సభ్యులు బి.గాదిలింగ మొబైల్ 80080 24985, కె.అఖిల్ మొబైల్ 81791 34829, ఎ.లాలుస్వామి 98660 62409, బి.చక్రి 74700 74712లకు ఫోన్చేసి పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. పోటీలు ఉదయం 6 గంటల నుండే ప్రారంభమవుతాయని వివరించారు.

## అనాధ మృతదేహానికి అంతిమ సంస్కారాలు

గుంతకల్లు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

ఆ నలుగురు సేవాసమితి ఆధ్వర్యంలో ఓ అనాధ మృత దేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. పట్టణంలోని పాత బస్టాండ్ దగ్గర గుర్తుతెలియని ఓ వ్యక్తి (50) మృతి చెందిన విషయాన్ని టూటౌన్ పోలీసులు వ్యవస్థాపక అధ్యక్షులు మంజుల వెంకటేష్కు సమాచారం ఇచ్చారు. ఆయన సూచనల మేరకు సమితి సభ్యులు గురువారం మృతదేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రవీంద్ర, టూటౌన్ పోలీసులు వీరాంజనేయులు, ఓబులేష్, సభ్యులు లింగేశ్వర్, రత్నమ్మ, ఈరమ్మ, అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## జననేత రవిశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు..!

మడకశిర టౌన్ ఏప్రిల్ 3 ప్రభాతవార్త,



రవి శేఖర్ రెడ్డి కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వైకాపా నాయకులు

మడకశిర నియోజకవర్గం వైబిహళ్లి వైయస్సార్సీపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వై. ఎన్ రవి శేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆయన అభిమానులు ఘనంగా పట్టణంలోని ఆయన స్వగృహంలో అభిమానులు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకల్ని మడకశిర నియోజకవర్గం ఇంచార్జ్ ఈరలక్కప్ప తొలత కేక్ఖి కట్ చేసి అందించారు .ఈ సందర్భంగా మండలపల్లె సర్పంచు అశ్వత్త,వై బి హళ్లి గ్రామపంచాయతీ నాయకులు మనోహర్ రెడ్డి విశ్వనాథ్ హనుమంతు గౌడ్ హనుమంతు నరసింహమూర్తి రాజశేఖర్ హనుమంత రాయప్ప శ్రీరంగ రవికుమార్ జగన్నాథ రెడ్డి హరేసముద్రం లక్ష్మి నారాయణ, తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## డీజిల్, టోల్ ధరల పెంపు ఉపసంహరణకు సీపీఐ(ఎం) డిమాండ్

బళ్లారి, ఏప్రిల్03, ప్రభాతవార్త;

డీజిల్, టోల్ ధరలు అమాంతం పెంచి జన సామాన్యులపై హెచ్చు భారం మోపారని, తక్షణమే దీనిని ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎం) బళ్లారి జిల్లా సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేసిన సమితి కార్యదర్శి జె.సత్యబాబు రాష్ట్రంలో ఉగాది పండగ ముందే పాలధర, విద్యుత్ధరతోపాటు చెత్తసేకరణ చార్జీలపెంపును అనుభవిస్తుండగానే ఏప్రిల్ 1వ తేదీన రాత్రి నుంచే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం డీజిల్ ధర ప్రతి లీటర్కు రూ.2 పెంచడం జరిగింది. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 4 నుంచి 5 శాతం టోల్ ధరలను పెంచి అత్యంత ప్రజా వ్యతిరేక చర్యకు పాల్పడిందని, ఈ రెండు ధరల పెంపును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ(ఎం) తన పోరాటాన్ని తీవ్రతరం చేసేందుకు నిర్ణయించినట్లు సత్యబాబు తెలిపారు. సమితి కార్యదర్శి మండలి సభ్యులు హెచ్.తిప్పయ్య, వి.ఎస్.శివశంకర్, కె.చంద్రకుమారి, జె.చెన్నబసయ్యలు పాల్గొన్నారు.

## బండిహట్టి పురాతన బావి స్థలాన్ని కబ్జాదారుల నుంచి రక్షించాలంటూ ప్రతిఘటన

బళ్లారి, ఏప్రిల్03, ప్రభాతవార్త;



డి.సి. కార్యాలయంలో ప్రతిఘటన చేస్తున్న కర్ణాటక ఏకీకరణ రక్షణ సేనాసమితి కార్యకర్తలు

నగరంలోని బండిహట్టిలో గల అత్యంత పురాతన బావి చుట్టుపక్కల ఉండే రెవెన్యూ స్థలాన్ని భూకబ్జాదారులు స్వాధీనం చేసుకుని ఆక్రమిం చుకున్నారని, దీనిని రక్షించాలని డిమాండ్ చేస్తూ కర్ణాటక ఏకీకరణ రక్షణ సేనాసమితి కార్యకర్తలు డి.సి.కార్యాలయంలో ప్రతిఘటన చేపట్టారు. బండిహట్టి నుంచి డి.సి.కార్యాలయం వరకు స్థానికులతో కలిసి పాదయాత్రగా వచ్చిన సమితి కార్యకర్తలు డి.సి.కార్యాలయంలో తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ప్రతిఘటనకు నేతృత్వం వహించిన సమితి నాయకుడు శేఖర్ ఏడీసీ మహమ్మద్జుబేరాకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ఈ బావిలో నీటిని దళితుల దేవస్థానాలకు, శుభకార్యాలకు ఉపయోగిస్తున్నారని, కుళాయిలు, బోర్వెల్ వచ్చిన తర్వాత ఈ బావి నీరు వినియోగం ప్రజలు చేయడంలేదని, అయితే బావి చుట్టుపక్కల ఉన్న ఖాళీ స్థలంపై కొందరు వ్యక్తులు కన్నేసి నకిలీ దాఖలాలు సృష్టించి స్థలం తమదే అన్నట్టుగా రికార్డులు సృష్టించారని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపి భూకబ్జాదారులపై చర్యలు తీసుకుని, పురాతన బావిని, స్థలాన్ని రక్షించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనికి స్పందించిన ఏడీసీ మహమ్మద్జుబేర్ సంబంధిత రెవెన్యూ అధికారులకు సూచించి సదరు స్థలానికి సంబంధించి వివరాలు సేకరించి ఆ మేరకు ప్రభుత్వ స్వాధీనం చేసుకుంటామని హామీ ఇచ్చారు.

## చీటీల పేరుతో ప్రజలకు వంచన

- వాసవీ స్వగృహ హోం నీడ్ నుంచి రూ.19 లక్షలు స్వాధీనం

బళ్లారి, ఏప్రిల్03, ప్రభాతవార్త;



వాసవీ స్వగృహ హోం నీడ్ నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న రూ.19 లక్షలు నగదు

నగరంలోని కుమ్మర వీధిలో వాసవీ స్వగృహ హోం నీడ్ అనే దుకాణంలో వినియోగదారుల నుంచి చీటీల రూపంలో డబ్బు వసూలు చేసి 25 శాతం నెలసరి కమీషన్ లాభం ఇస్తామని వంచన చేసిన వ్యక్తిని స్థానిక బ్రూస్పేట పోలీసులు అరెస్టు చేశారు. వినియోగదారులకు తామిచ్చే డబ్బుకు అధిక లాభాన్ని ఇస్తామని నమ్మించి, డబ్బు పొంది ఎటువంటి కమీషన్ డబ్బు ఇవ్వకుండా చీటీ పేరుతో వాసవీ స్వగృహ హోం నీడ్స్ దుకాణం యజమాని టి.విశ్వనాథ్(58) మోసం చేశాడని ప్రజలు ఫిర్యాదు చేయడంతో పోలీసులు దుకాణంపై సోదాలు జరిపి విశ్వనాథ్ను అదుపులోకి తీసుకొని రూ.19,38,500 నగదుతోపాటు వినియోగదారులు నిందితుడికి డబ్బు చెల్లించిన దాఖలాలుగా ఉన్న చీటీలు స్వాధీన పరుచుకున్నారు. సహకార సంఘాల సహాయక రిజిస్ట్రార్ జ్ఞానప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు గత ఆరు నెలలుగా ప్రభుత్వం నుంచి మంజూరయ్యే ఎటువంటి ప్రాధికారం నుంచి ముందస్తు అనుమతి లేకుండా వినియోగదారులకు మోసం చేసే దురుద్దేశ్యంతో వినియోగదారుల నుంచి అనధీకృతంగా చీటీల రూపంలో నగదు కట్టించుకుని, డబ్బుకు 25 శాతం బోనస్ రూపంలో చెల్లిస్తానని నమ్మించి వినియోగదారులకు ఎటువంటి బెనిఫిట్ డబ్బును చెల్లించకుండా చీటీ వ్యవహారం చేస్తూ విశ్వనాథ్ ప్రజలను వంచించారని, కేసు నమోదు చేసుకున్న బ్రూస్పేట పోలీసులు తెలిపారు. విశ్వనాథ్ వినియోగదారులతో నిర్ణీత కాల పరిమితికి నియమానుసారం కంతుల రూపంలో సార్వజనికుల నుంచి డబ్బు వసూలు చేసి చీటీ ఒప్పందం చేసుకుని వినియోగదారులకు ఎటువంటి లాభాంశం ఇవ్వకుండా మోసానికి పాల్పడడం చట్టవిరుద్ధమని, అతడిపై బ్రూసే ్పట పోలీస్స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు సీఐ టి.మహంతేష్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ డా.శోభారాణి ఒక ప్రకటనలో తెలిపారు.

## ఏప్రిల్ 10 వరకు ఎల్ఎల్సీకి నీరు వదలండి

- తుంగభద్ర రైతుసంఘం డిమాండ్

బళ్లారి, ఏప్రిల్03, ప్రభాతవార్త;

జిల్లాలోని కంప్లీ క్షేత్రం ఎమ్మెల్యే జె.ఎన్.గణేష్ను కురుగోడు తాలూకా బాదనహట్టి గ్రామంలో కలిసిన తుంగభద్ర రైతు సంఘం జిల్లాధ్యక్షుడు దరూరు పురుషోత్తంగౌడ, పదాధికారుల బృందం ఎల్ఎల్సీ కాలువకు ఏప్రిల్ 10వ తేదీ వరకు నీరు విడుదల చేయాలని కోరారు. మార్చి 21న విధానసౌధలో జరిగిన నీరావరి సలహా సమితి సభలో ఎల్ఎల్సీ కాలువకు నీరు విడుదల చేసేందుకు తీర్మానించినట్లు, ముఖ్యమంత్రి భద్రా జలశయం నుంచి రెండు టీఎంసీల నీరు విడుదల చేసేందుకు కూడా అంగీకరించారని, ఆ ప్రకారం ఎల్ఎల్సీ కాలువకు నీటి సరఫరా కొనసాగించాలని డిమాండ్ చేశారు. బెంగళూరులో జరిగిన సభలో బళ్లారి, రాయచూరు, విజయనగర, కొప్పళ జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లాధికారులు, వ్యవసాయశాఖ అధికారులు తుంగభద్ర డ్యాం అధికారులు తీసుకున్న నిర్ణయం ప్రకారం ఏప్రిల్ 10వ తేదీ వరకు ఎల్ఎల్సీ కాలువకు నీరు విడుదల చేసేందుకు అంగీకరించారని, సీఎం సిద్ధరామయ్య భద్రా జలాశయం నుంచి 2 టీఎంసీల నీరు విడుదల చేసేందుకు సూచించినట్లు, అయితే రాష్ట్ర ప్రభుత్వపు ముఖ్య కార్యదర్శి డా.శాలినీరజనీస్ మార్చి 30న బళ్లారి, విజయనగర జిల్లా మంత్రుల్ని సభకు ఆహ్వానించకుండా కొప్పళ జిల్లా ఇన్చార్జి మంత్రి శివరాజ్ తంగడిగి, రాయచూరు జిల్లా ఇన్చార్జి మంత్రి డా.శరణ్ప్రకాష్ పాటిల్లతో సభ జరిపి ఎల్ఎల్సీకి ఏప్రిల్ 5వ తేదీ వరకు మాత్రం నీరు విడుదల చేయడం సాధ్యమవుతుందని, మిగిలిన నీరు తాగేందుకు సేకరణ చేసి, అవసరమైన సమయానికి విడుదల చేసేందుకు తీర్మానించడం రైతుల ఆగ్రహానికి గురయ్యిందని అధ్యక్షుడు దరూరు పురుషోత్తంగౌడ ఆరోపించారు. ఏప్రిల్ 10వ తేదీ వరకు ఎల్ఎల్సీలో నీటి సరఫరా చేసి రైతుల పంటల్ని కాపాడాలని ఎమ్మెల్యే గణేష్కు వినతి పత్రం అందజేసి, పురుషోత్తంగౌడ డిమాండ్ చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గణేష్ తాను సీఎంతో మాట్లాడతానని, ఆందోళన చెందవద్దని రైతులకు హితవు చెప్పారు.

## ఘనంగా జపనీస్ డే నిర్వహించిన విదేశీ భక్తులు

పుట్టపర్తి రూరల్ మార్చి 03 ప్రభాతవార్త



జపనీయుల సాంస్కృత నృత్యాన్ని ప్రదర్శిస్తున్న విదేశీ భక్తులు





ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో జపనీలా న్యూఎరా అయినా జపనీస్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జపాన్ కు చెందిన విదేశీ భక్తులు వందలాదిమంది ప్రశాంతి నిలయానికి విచ్చేశారు. ఈ వేడుకలు నిర్వహించడానికి జపాన్ శ్రీ సత్యసాయి సేవా సంస్థల చైర్ పర్సన్ మాసాకి సుమిటోమో, జపాన్ సమాచార వ్యవస్థ చైర్పర్సన్ మరియు జపాన్ కు భారత మాజీ రాయబారే అయిన సంజయ్ కుమార్ వర్మ పాల్గొన్నారు. రెండు రోజుల వేడుకలలో భాగంగా మొదటి రోజైన గురువారం జపాన్ భక్తులు ఉదయం వేదమంత్ర పఠనంతో వేడుకలను ప్రారంభించారు. అనంతరం జపాన్ భాషలో సత్యసాయి అష్టోత్తరం పఠించారు. అనంతరం జపాన్ సాంస్కృతిక నృత్యమైన రిక్యూబయో, సకురా సకురా నిహోన్ బయో, కిసాయి మరియు ఒకినోవా అను సంగీత మరియు నృత్య ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా జపాన్ సేవా సంస్థల అధ్యక్షులు మాట్లాడుతూ సేవా సంస్థలలోని సేవాదళ్ సభ్యుల ద్వారా కోవిడ్ 19 సమయంలో అందించిన సేవలు మర్చిపోలేని వన్నారు. సత్య సాయి చూపిన మార్గమే మానవ మనుగడకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం మహిళా విభాగం సభ్యులు నృత్యాన్ని ప్రదర్శించారు నీ నృత్యం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం వీరిని సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ రాజ రత్నాకర్ నూతన వస్త్రాలను బహరించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వందలాదిమంది జపాన్ దేశభక్తులతో పాటు, సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు ,భక్తులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన వైసిపి నాయులు

కణేకల్లు, ఏప్రిల్ 03 ప్రభాతవార్త;



నూతన వదువరులను ఆశీర్వదిస్తున్న వైసిపి నాయకులు

కణేకల్లు మండల పరిధిలోని బెనకల్లు గ్రామంలో జరిగే ఎజ్జిగుంట సర్పంచన వన్నూర్మ అక్క అక్క బావల కుమా రుడు శాంతకువార్ సుమబిందు వివాహానికి మండలంలోని వైసిపి నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు మారేంపల్లి మారెన్న, జిల్లా కోశాధికారి మరియు మాజీ జడ్పిటిసి గేనిగేర నాగిరెడ్డి, మాజీ మార్కెట్యార్డు వైస్ చైర్మెన్ వై.వన్నూరప్ప, రామిరెడ్డి, స్థానిక సర్పంచ్ ప్రభాకర్రెడ్డి, కణేకల్లు వైసిపి మండల కార్యదర్శి హనుమంతు, నాగరాజు తదితరులు వైసిపి నాయకులు ఈ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులకు అక్షింతలువేసి ఆశీర్వదించారు.

## శ్రీరామనవమి సందర్భంగా పరుగుల పోటీలు...!

ధర్మవరం,మార్చి3(ప్రభాతవార్త)

ధర్మవరం మండలం గొట్లూరు గ్రామంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా గ్రామంలో అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఇందులో భాగంగానే ఆదివారం గొట్లూరు గ్రామంలో సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ఉన్న క్రీడాకారులకు, ఉత్సాహవంతులకు ప్రోత్సహించే విధంగా పరుగుల పోటీలు నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు ధర్మవరం మండల బిజెపి నాయకులు గొట్లూరు చంద్ర ఓ పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ పరుగుల పోటీలలో మొదటి స్థానంలోగెలిచిన వారికి 5016రూపాయలు బహుమతి అందజేయడం జరుగుతుందని, ద్వితీయ స్థానం సాధించిన వారికి 3016రూపాయలు, మూడో బహుమతిగా 2016, నాలుగో బహుమతిగా 1016 వేల రూపాయలు బహుమతులుగా అందజేయడం జరుగుతుందని, ఈ పురుగుల పందాలు గొట్లూరు గ్రామ సమీపంలో ఉన్న మాంకాలమ్మ ఆలయం వద్ద నుండి ప్రారంభించడం జరుగుతుందని నిర్వాహకులు గొట్లూరు చంద్ర తెలిపారు.

## పావగడ నూతన బస్టాండ్లోని అంగడి రూమ్ల ముగిసిన బాడుగ వేలం పాట

పావగడ, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



అంగడి రూంల వేలం పాటను నిర్వహిస్తున్న మున్సిపల్ అధ్యక్షుడు రాజేష్

పావగడ మున్సిపాలిటీలో మూడవ విడతగా పావగడ నూతన బస్టాండ్లోని 22 అంగడి రూమ్ల బాడుగ వేలం పాట గురువారం ముగినింది. వేలంపాటలో ఒకటవ రూం రూ.17,000, రెండవ రూం రూ.12,600, మూడవ రూం రూ.13,200, నాలుగవ రూం రూ.16,500, 5వ రూం రూ.34,100, ఆరవ రూం రూ.32,000 ,ఏడవ రూం రూ.20,000, 8వ రూం రూ.20.700 వేలు, 9వ రూం రూ.32,700, 10వ రూం రూ.20,000, 11వ రూమ్ రూ.40,200, 12వ రూం రూ.21,300, 13వ రూం రూ.21,200, 14వ రూం రూ.10,500, 15వ రూం రూ.26,200, 16వ రూం రూ.10,500, 17వ రూం రూ.9000, 18వ రూం రూ.9000, 19వ రూం రూ.16,000, 20వ రూం రూ.11,800, 21వ రూం రూ.8000, 22వ రూం రూ.37,100లతో కొందరు వేలంపాటలో దక్కించుకున్నారు. ఇందులో 11వ రూమ్ అత్యధికంగా రూ.40,200లకు, 21వ రూం అతితక్కువగా రూ.8000 బాడుగకు దక్కించుకున్నారు. మున్సిపల్ అంగడి రూములబాడుగ..వేలంపాటలో తేడాలా ? పావగడ మున్సిపాలిటీ పరిధిలోని అంగడి దుకాణాల బాడుగ వేలం పాటను మూడు విడతలుగా నిర్వహించారు. పాత బస్టాండ్లోని అంగడి రూమ్ల బాడుగ వేలంపాట లో కూడా తేడాలున్నాయని, అదే విధంగా నూతన బస్టాండ్లో అంగడి రూమ్ల బాడుగ వేలం పాటలో కూడా తేడాలున్నాయని, గురువారం నిర్వహించిన వేలం పాటలో కూడా తేడాలున్నాయని కొంత మంది మధ్యవర్తుల ద్వారా గ్రూపులుగా ఏర్పడి లోలోపల కమిట్మెంట్లతో తక్కువ బాడుగలకు పాడారని కొందరు అనుమానాన్ని వ్యక్తపరుస్తున్నారు. ఈ వేలం పాట కార్యక్రమంకు మున్సిపల్ అధ్యక్షుడు రాజేష్, చీఫ్ ఆఫీసర్ జాఫర్ షరీఫ్ కౌన్సిలర్లు హాజరయ్యారు.

